# సిల్కు చీరె

★

రచన :

శ్రీ నందివాడ కామేశ్వరరావు



"రావుగాడు పదోతరతి మూడు దండయాత్రలు చేసేప్పటికి వాళ్ళనాన్న నిరాశ చేసుకున్నాడు. వాడికియిక చదువు అబ్బదుఅని. అప్పటికే వాడికి యిరవై యేళ్ళు వచ్చేయి. యింకెన్నాళ్ళు యీ టెంతు క్లాసు చదువుతాడు? వాడితోడి వాళ్ళంతా బి. ఎ ల్లోకి వస్తే వాడు మాత్రం బీరువాలాగ యెక్కడ వేసిన గొంగళీ అంటె అక్కడే అన్నట్లు ఆ పదోక్లాసులోనే కూర్చుంటున్నాడు. పాపం వాళ్ళనాన్నకి వాడిజీవితం ఒక పెద్ద సమస్యగ పరిణమించింది. వయస్సుచూస్తే మించిపోతూంది. పాతిక యేళ్ళు దాటేకా ప్రభుత్వోద్యోగం యివ్వరు. వాడికా చదువురాదు. ఆలోచిస్తూ కూర్చుంటేలాభం లేదని పాపం ఆ ముసలాయన తనపాత స్నేహితుడు చుట్టపంతులు దగ్గరకెళ్ళి తనకొడుకు ప్రతాపంచెప్పేడు. చుట్టపంతులు అంటె తపాలాశాఖలో పని చేస్తూవున్న సూర్యం పంతులు. చుట్టలు యెక్కువ తాగుతాడని చుట్టపంతులన్నారు. పాతస్నేహితుడు ముసలాయన స్వయంగా వచ్చి కొడుకుగురించి చెప్పుకుంటె కాదనలేక సరే యేదైన అవకాశం చూసి వేస్తానన్నాడు. అనడం యేమిటి ఓ యి. డి. వుద్యోగం వేయించేడు మనరావుకి. అన్నట్లు రావు అంటే చెప్పడం మర్చేను. అసలు పేరు ముయ్యాలరావు. యింటిదగ్గర రావు అని బడిలో ముత్యం అని పిలుస్తువుంటారు. తపాలశాఖలో యి.డి. వుద్యోగం అంటే ఓ నూట పదిరూపాయిలు యిస్తారు. యేదో పాపం వేడినీళ్ళకి చన్నీళ్ళలాగ ఆ తండ్రికి పనికి వస్తూంది.

యీ రోజుల్లో వుద్యోగంవున్న కుర్రవాడు వుంటేచాలు, పిల్లనివ్వడానికి తయారయిపోతున్నారు ఆడపిల్లగల వాళ్ళు. రావుకి వుద్యోగం అయి మూడేళ్ళు అయినా అవలేదు అప్పుడే సంబంధాలు వచ్చి పడుతున్నాయి. తండ్రికి

యిష్టంలేదు. పెద్ద వుద్యోగం అయితే చెయ్య వచ్చు యిప్పట్నుండి యెందుకని అతనివుద్దేశం.

అయినా యెవరి తాపత్రయం వాళ్ళది. వేగిరంగా నిశ్చయించుకోక పోతె గద్ద కోడిపిల్లని తన్నుకుపోయినట్లు ఆ పెళ్ళికొడుకుని కాస్త యెవరైన తన్నుకు పోతారేమోనని, యెక్కడో బిలాయిలో వుంటున్న మేనత్త అన్నయ్య అంటూ వచ్చేసింది. మనం చిన్నప్పుడే అనుకున్నాం కదా రావుగాడికి వరలక్ష్మికి అన్ని విధాల సరిపోయిందని, యిప్పుడు వాడిని ఓ యింటివాడిగా చేస్తే బాగుంటుంది అని ఆవిడ గోల ఆవిడిది. అన్నగారంటే తాటాకలాగ బుర్ర వూపుతున్నాడు గాని, ఒదినగారో ఆవిడ మహాగయ్యాళి పేరుకుతగ్గ మనిషి. మహాంకాళి. మహాంకాళి అమ్మగారంటే ఆవీధి అంతా గడగడ లాడతారు. తల్లినీళ్ళకి వస్తున్నారు అంటె కొళాయి దగ్గరకాళి, యెంత వెనక్కివచ్చినా ముందు ఆవిడకు యిచ్చేయాలి, లేకపోతె బిందెలు పటాసుకాయల్లాగ యెగురుతాయి. అలాంటి ఒదినగారితో యెలాగ మాట్లాడాలి, యెలాగ నచ్చచెప్పితే ఆవిడ వింటుంది? ఆవిడికి ధనదాహం లావు. కొడుకు కలక్టరు అనుకుంటుంది. నూరురూపాయిలు జీతగాడికి నాలుగు వేలు కట్నం యెవరుయిస్తారు? యెలాగో కాళ్ళ


# పిండి రుబ్బే మెషిన్!!

SVE



మినివైప్ గ్రైండర్

- విద్యుత్ శక్తితో పరిగెత్తె క్రొత్త నమూనా పిండి దుబ్బే మెషిన్.
- ఇంటి పనికీ, హోటల్స్‌కూ, కేంటీన్‌లకు చాలా వుపయోగమైనది.

**Silent Running, Long Life,**
**Mini Wet Grinder For House Use.**

ఇంటి పనులకుగాను "మిని వైప్" పిండి రుబ్బే మెషిన్ రుడిగా వున్నది.

విశేషాంశములు :— చూచుటకు అందముగా వుండును, చిరకాల మన్నిక, నిశ్శబ్దమైన పరుగు, ఖర్చులో తక్కువ.

ఆంధ్రప్రదేశానికి సెల్లింగ్ ఏజెంట్లు :— గోబి బ్రదర్స్, 5-1-498 రాణిగంజ్, సికిందరాబాద్-500 003.

: తయారించువారు :

Phoen: 32023 & 31577

**Sri Venkateswara Engineering Works,**
54, Mettupalayam Road : : COIMBATORE - 641 011.

OSR

వేళ్ళబడి రెండు వేలకి వప్పించింది ఆడపడుచు.

యింకేముంది మంచి చలిరోజులు మార్గశిరమాసంలో పెళ్ళి. పెళ్ళికొడుక్కి పెళ్ళికూతురుకి అంటె ఆమాసం అనుకూలంగా వుంది గాని మరి పెళ్ళికొచ్చిన వాళ్ళకో? చల్లో దవడలు మిల్లరు కప్పలాగ నొక్కుకు పోతూవుంటే పెళ్ళి వారికంతా మిగులే. భజంత్రీమేళాన్ని "త్రైయివరు రాముడు"లో పాటలు వాయించమంటే తారీల చప్పుడులాగ డప్పులు బాదేస్తున్నారు. యేదో ఆగోలలో యెవరు తుమ్మకుండ పుస్తెముడికాస్త పడిపోయింది.

పెళ్ళి అయిపోయిన మర్నాడే మహంకాళి యింటికి, అంటే అత్తవారింటికి కొత్తకోడలు తయారు. రావుగాడి వుద్యోగం, వర్థలక్ష్మి కాపురం, మామగారి మమతలు, మహంకాళి అమ్మ హుంకరింపులు ఆవీధిలో అందరికి వూసులు.

మరేంకాదు. యిన్నాళ్ళు కొళాయి, దగ్గర ఒక బిందెనీళ్ళే యిచ్చేవాళ్ళం, యిప్పుడు అత్తగారు కోడలు యిద్దరికి చెరి బిందెయిచ్చేక కొళాయి కట్టకుండా వుంటే మిగతావాళ్ళు పట్టుకోవాలి.

ర ర ర

"యేమండీ"

వుక్కు, అప్పుడే ప్రారంభించేవు!

పగలల్లా పోస్టాఫీలులో పనిచేసిన ముత్యాల రావు రాత్రి ఏ ఏడు గంటలకో యిల్లుచేరుకుంటాడు. తల్లి పెట్టిన మెతుకులు కాస్త తిని నడుంవాలుద్దాం అనుకునే సరికి కొత్తపెళ్ళాం "యేమండీ" అనే సరికి గుండెల్లో టా టా ఎక్స్ప్రెస్ పరిగెత్తినట్లయింది.

"ఆహా! మరేంలేదు.

"మరేం లేకపోతె పడుకో"

అదికాదండి యెల్లుండి దీపావళికదా! మన పెళ్ళిఅయిన సంవత్సరం. సిల్కుచీరకొని పెట్టరా?

బాగుంది. తనవుద్యోగం చిన్నదని చెప్పుకుందుకి సిగ్గు. చీర కొనిపెట్టకపోతే పెళ్ళాం బాధపడుతుంది. యెలాగ సద్ది చెప్పటం?

వరం మీవాళ్ళు బ్రతికి వుండగా మనకి బట్టలకి కొదవయేమిటి? రెండు నెలలు వూరుకున్నావంటె పండుగ వచ్చేస్తోంది. అత్తవారు అల్లుడిని పిలుస్తారు కదా? అప్పుడు వాళ్ళెయిస్తారు నువ్వు పట్టుచీరె అడుగు.

బాగుందండీ? మావాళ్ళు యిస్తారని మీరు కొనరా?

"నేను కొంటాను"

"యెప్పుడు?"

"అవకాశం కుదిరినప్పుడూ.

"మీకు యెప్పుడూ అవకాశం కుదరదు! జీతం అంతా మీ అమ్మచేతిలో పెట్టి దండం పెడతారు" నాకు ఒక్కరోజైన ఒక రూపాయి యిచ్చేరా?

"లేదు వరం. యికమీదనుంచి ప్రతినెల నీకేయిస్తాను" యిటు తిరుగు చెప్తాను.

"మమ్మా యెందుకు? చీరకొంటానంటేనె" లేకపోతె నే తిరగను.

లేదు వరం! రేపు సాయి సిల్కుపేలస్ వాళ్ళకి ఫోనుచేసి అడుగుతాను, వాళ్లు తప్పకుండా యిస్తారు.

"నిజమేనా!"

"నిజంగా"

"ఒట్టువేయండి" పాపం అమాయకురాలు అటునుండి యిటు తిరిగింది.

యింకేముంది. యెవరి అవస్త వాళ్లది.